

కనక దుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల భవానీనగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం సందర్భంగా పాతూరు భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి శుక్రవారం మహిళలు సారె సమర్పించారు.

శాకంబరీగా వాసవీమాత



అచ్చంపేట: ఆషాఢ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా అచ్చంపేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిని శాకంబరీగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు.

న్యూస్‌రీల్

పింగళి జీవితం స్ఫూర్తిదాయకం

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల: జాతీయ పతాకాన్ని రూపకల్పన చేసి తెలుగువారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన పింగళి వెంకయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. పింగళి వెంకయ్య 62వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈసందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ రెపరెపలాడే మువ్వన్నెల జెండా తెలుగువారి ఘనతను చాటుతుందన్నారు. తెలుగు వారికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవ, ప్రతిష్టలను తీసుకువచ్చిన పింగళి చిరస్మరణీయులని పేర్కొన్నారు. జాతి అస్తిత్వానికి, మనుగడకు మూలమైన త్రివర్ణ పతాకాన్ని ఆయన మనకు అందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, చల్లా రామయ్య, తన్నీరు అంకమ్మరావు, ఉరబిండి గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

కష్టాల్లో పింగళి వెంకయ్య కుటుంబీకులు

దయనీయ స్థితిలో ఆయన మనవరాలు భవాని



చీరాల: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మనవరాలు భవాని దయనీయస్థితిలో ఉంది. అనారోగ్యానికి గురై కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం జరిగినా అది శిథిలావస్థకు చేరింది. పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దేవాంగపురిలోని ఆయన మనవరాలు భవాని గృహంలో జరగ్గా ఈ విషయాలు వెలుగు చూశాయి. వర్ధంతి కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బట్ట మోహనరావు మాట్లాడుతూ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధునిగా ఎన్నో సేవలు చేశారన్నారు. కృష్ణాజిల్లా దివి తాలూకా పెద్ద కల్లేపల్లి గ్రామంలో 1878లో ఆయన జన్మించారన్నారు. ఉన్నత చదువులు చదివిన ఆయన చరిత్ర అధ్యాపకుడిగా పనిచేశారని వివరించారు. ఆయన మనవరాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం సీతారామయ్య, భవాని దంపతులను రోటరీ క్లబ్ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌బాబు, కార్యదర్శి అక్కల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో మొహరం జరుపుకోండి

పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: మొహరం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. మొహరం పురస్కరించుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు శుక్రవారం తెలిపారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వేడుకల్లో అల్లర్లు, వివాదాలకు తావులేకుండా అందరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైళ్లలో తనిఖీలు



నరసరావుపేట టౌన్: మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా రైళ్లల్లో తనిఖీలు చేపట్టినట్లు పల్నాడు జిల్లా ఈగల్ సెల్ ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్ తెలిపారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు భువనేశ్వర్ నుంచి నరసరావుపేట మీదుగా బెంగళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైల్లో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో శిక్షణ పొందిన జాగిలంతో, స్థానిక పోలీసులతో పాటు జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ సెల్ పోలీసులు దాడులు చేశామన్నారు. అనుమానిత ప్రదేశాలు, అనుమానితుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. దాడుల్లో ట్రాఫిక్ ఎస్ఐ వేణు, జీఆర్పీ ఎస్ఐ శ్రీనునాయక్, పాల్గొన్నారు.

అన్నదాత పక్షాన

నిరసన గళం

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నినదించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు
- గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్న రైతులు
- కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



సమావేశం వేదికపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ : అన్నదాతల ఆక్రందనలపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ సర్వసభ్య సమావేశం వేదికగా గళం విన్పించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారుల నుంచి రైతులకు నష్ట పరిహారాన్ని అందించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. మిర్చి, పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాలు చూస్తున్న సంఘటనలపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనంద్‌బాబు, బాష్యం ప్రవీణ్, జీడీసీఎంఎస్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరి బాబు, బాపట్ల డీఆర్వో గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, ఏడీ మైనింగ్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభులు, ఎంపీపీలు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వరికపూడిశెల నిర్మాణానికి ప్రాధాన్యం

నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెదకూరపాడు మండలంలో గారపాడు చెరువు పూడ్చివేసి అక్రమించడంపై జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

» జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ బ్యాంకులు ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నల్లబర్లి పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

» పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు చెప్పారు.

» మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రైతులు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఐడీసీ స్కీంలో పంటలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

» ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను 4వ స్థాయీ సంఘ సభ్యునిగా ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థాయి సంఘాల్లో ఆమోదించిన పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

జెడ్పీటీసీలు ఏమన్నారంటే...

➡ పెదకూరపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కంకణాల స్వర్ణకుమారి మాట్లాడుతూ గారపాడులో రెండున్నర ఎకరాల చెరువును ఆక్రమించారని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, గ్రామంలోని పెత్తందారులు ఇంటిపైకి దాడి చేసేందుకు వచ్చారని వాపోయారు. నాలుగు ఎకరాల చెరువును పూడ్చి అక్రమ కట్టడాలు కడుతుంటే, వర్షాలు కురిసినప్పుడు నీరు ఏ విధంగా ప్రవహిస్తుందని ప్రశ్నించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

➡ అమరావతి–సత్తెనపల్లి మార్గంలో జెడ్పీకి చెందిన రూ.కోట్ల విలువైన రెండెకరాల స్థలం ఆక్రమణలకు గురైందని సభ దృష్టికి తెచ్చారు, ప్రస్తుతం అది డంపింగ్ యార్డుగా వాడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.

➡ బొల్లాపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రమావతు భీమిబాయి మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి బొల్లాపల్లి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుతో బొల్లాపల్లి మండలంలోని 20 గ్రామాల ప్రజలు నిరాశ్రయులుగా మారే పరిస్థితులు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరికెపూడిశెల వచ్చిందని ఆనందపడేలోపు బనకచర్ల రూపంలో నిర్వేదం ఎదురైందని తెలిపారు.

➡ గురజాల మెడికల్ కళాశాల ప్రగతిపై పలువురు జెడ్పీటీసీ సభ్యులు సంధించిన ప్రశ్నలపై వైద్యారోగ్యశాఖాధికారులు సమాధానాలు చెప్పలేకపోయారు. దీనిపై ఎంపీ లావు కృష్ణదేవరాయలు జోక్యం చేసుకున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, వాటితో చేపట్టిన పనుల ప్రగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు.

➡ అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తున్నారంటూ రాజుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు సునీతారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు హసీం ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు సమాధానమిస్తూ కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయగానే వాటితో కలిపి మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.20వేలు జమ చేస్తామని చెప్పారు.

➡ రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుల ఆమోదం లేకుండా పనులకు అనుమతులు ఇచ్చేసి, తీరా అవి పూర్తయిన తరువాతా సభలో పెట్టి ఆమోదించమంటున్నారని.. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు.

పీ–4 అమలులో బాపట్ల జిల్లా ప్రథమం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి సీఎం అభినందనలు



బాపట్ల: పీ–4 అమలులో బాపట్ల జిల్లా కలెక్టర్ ప్రణాళిక, అధికారుల సమష్టి పనితీరు చాలా బాగుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. పీ–4 అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో 62,388 బంగారు కుటుంబాలు ఉంటే 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శిలకు దత్తత ఇవ్వడంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసించారు. బంగారు కుటుంబాలను 72శాతం అనుసంధానించడం అభినందనీయమన్నారు. మిగిలిన 17వేల కుటుంబాలను మార్గదర్శిలకు దత్తత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు బాపట్లను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఎం సూచించారు. పీ–4 విధానంలో బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి సీపీఓ షాలేమ్ రాజు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ గ్లోరియా, తదితరులు హాజరయ్యారు.

నేడు నృసింహుని హుండీ కానుకల లెక్కింపు

మంగళగిరి టౌన్: స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధిలోను, శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

పచ్చి అబద్ధాల కోరు చంద్రబాబు



క్యూఆర్ కోడ్ ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ మాధవరావు, చిన హనిమిరెడ్డి

- కూటమి సర్కారు వైఫల్యాలను ఇంటింటికి తీసుకెళదాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- అద్దంకిలో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' నియోజకవర్గ కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్సీ మాధవరావు, నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసే పచ్చి అబద్ధాల కోరు చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చే కార్యక్రమాన్ని అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పార్టీ పరిశీలకులు తూమాటి మాధవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు గిట్టుబాటు ధర అన్నారని.. ఏ పంటకు గిట్టుబాటు ధర ఇచ్చింది లేదన్నారు. మిర్చి రైతు నట్టేట మునిగాడన్నారు. పొగాకు రైతు పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. వరి రైతు ఉరివేసుకునే పరిస్థితి ఉందన్నారు. అన్నివర్గాలను చంద్రబాబు మోసం చేశారన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూ ఆర్ కోడ్ కలిగిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర ప్రచార విభాగం నాయకుడు పులికం కోటిరెడ్డి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, పాలపర్తి శ్రీధర్, కె.శ్రీవిద్య, సంతమాగులూరు జెడ్పీటీసీ అడవి శ్రీను, కొల్లా భువనేశ్వరి, మాకినేని శ్రీనివాసరావు, బాజీవలి, మురహరి యాదవ్, రఘురామగుప్తా, ఓబుల్ రెడ్డి తదితర నాయకులు మాట్లాడారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, సంతమాగులూరు మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు, ఓబులరెడ్డి, కాశీదేవి, రాష్ట్ర ప్రచార కమిటీ నాయకుడు కోయి అంకారావు, ముత్తవరపు రమణయ్య, బాబూ, ఊడత్తు సురేశ్, బి.మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్రలతోనే కూటమి అధికారం

: ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

ఒంటిగా పోటీ చేస్తే వైఎస్ జగన్ ప్రభంజనంలో కొట్టుకుపోతామని గ్రహించిన చంద్రబాబు అండ్ కో కూటమి కట్టి కుట్రలతో గెలిచారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. కూటమి నేతలు అక్రమార్జనకే సమయం సరిపోతుందని, ప్రజల గురించి వారికి పట్టదన్నారు.

నమ్మించి మోసం చేసిన చంద్రబాబు

: పానెం చిన హనిమిరెడ్డి

పార్టీలో అక్కడా.. ఇక్కడా నాటకాలాడే నాయకులను తాను నమ్మనని నియోజవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల పేరిట ప్రజలను నమ్మించి మోసం చేశాడన్నారు. హామీల అమలుపై ప్రశ్నించిన నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి భయకంపితులను చేస్తున్నారని, వాటికి ఎవరూ భయపడవద్దన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు.

ఇంటింటికి చంద్రబాబు మోసాలు

- సూపర్ సిక్స్ అడిగితే నాలుక కోస్తాననటం చంద్రబాబు అహంకారానికి నిదర్శనం
- వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున
- గుళ్లపల్లిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'
- పాల్గొన్న సమన్వయకర్తలు డాక్టర్ గణేష్, వరికూటి అశోక్‌బాబు

రేపల్లె: అధికారం కోసం మోసపూరిత హామీలివ్వటం, ప్రజలను మోసగించటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అంశంపై జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు తన స్వార్థం కోసం తప్ప ప్రజలను, రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోరన్నారు. మేనిఫెస్టోను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పవిత్ర గ్రంథంలా భావిస్తే చంద్రబాబు చిత్తు పేపరులా చెత్తకుండీలో పడవేశారన్నారు. హామీలు అమలు చేయకుండానే అమలు చేసేశాం, సూపర్ సిక్స్‌పై ప్రశ్నించే వారి నాలుక కట్ చేస్తామని చంద్రబాబు అనటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఏ హామీలు అమలు చేశారో బహిరంగంగా ప్రజలకు తెలియజెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేసేంత వరకు వైఎస్సార్ సీపీ ఇంటింటికి చంద్రబాబు మోసాలను తీసుకెళుతుందన్నారు.

ఏడాదిలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత

: డాక్టర్ ఈవూరు గణేష్

సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు, ప్రజలపై అక్రమ కేసులు తప్ప సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిందేమీలేదన్నారు. దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ శిరసా వహించాలన్నారు. ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు గుర్తు చేస్తూ ఇంటింటికి అందించాలన్నారు. ఈ సందర్భంగా బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, మండల సమన్వయకర్తలు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, యార్లగడ్డ వెంకటరాంబాబు, ఇంకొల్లు రామకృష్ణ, దుండి వెంకట రామిరెడ్డి, నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, కాటూరి శివనాగబాబు, చదలవాడ శ్రీనివాసరావు, కత్రి వెంకట కృష్ణారెడ్డి, వీసం నాగలక్ష్మి, బొర్రా శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, దొంతిబోయిన కొండలురెడ్డి, లుక్కా బాపనయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేరుగ నాగార్జున, సమన్వయకర్తలు డాక్టర్ గణేష్, అశోక్‌బాబు తదితరులు

ఇబ్బందులు ఉన్నా పథకాలు అమలు



ట్రై స్కూటీలను అందిస్తున్న మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు(అద్దంకి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని కామేపల్లిలో పర్యటించారు. అంతర్గత రోడ్లను ప్రారంభించారు. ఇంటింటికీ మంచినీటి పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. దివ్యాంగులైన ఏడుగురికి మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవగాహనారాహిత్యంతో ప్రేలాపనలు

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

ఖాజీపాలెం(కర్లపాలెం): బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అవగాహనా రాహిత్యంతో నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఖాజీపాలెం కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల 9వ వార్డులో బోయిన శివమ్మ అనే మహిళ పార్టీ మారలేదన్న అక్కసుతో ఆమె పెన్షన్‌ను గత ప్రభుత్వంలో తొలగించారని ఎమ్మెల్యే అనటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని కోన చెప్పారు. బోయిన శివమ్మకు పింఛన్ వస్తున్న విషయం వాస్తవమేనని ఆమెకు ఒక కుమార్తె, కొడుకు ఉన్నారని ఆమె కుమార్తె శిరీషకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే టీచరు ఉద్యోగం వచ్చిందన్నారు. శివమ్మ రేషన్ కార్డులో ఆమె కూతురు పేరు ఉండటం వలన అధికారులు శివమ్మ పింఛను తొలగించారని కోన రఘుపతి వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం తమదని కోన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా మీ ప్రభుత్వంలో శివమ్మకు ఎందుకు పింఛను ఇవ్వలేకపోయారని కోన నిలదీశారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు అవగాహన లేనప్పుడు అధికారులను అడిగి తెలుసుకుని మాట్లాడటం మంచిదని కోన హితవు పలికారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం: రూ. 1,200 గరిష్ఠం: రూ. 2,000

మోడల్ ధర రూ. 1,700

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	27,878
అమ్మకాలు	31,653
నిల్వ	3,750

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,200
273	రూ.10,000 – 13,500
341	రూ. 10,000 – 12,200
సూపర్ –10	రూ. 9,800 – 12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,800
బాడిగ – 355	రూ. 10,000 – 12,600
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,400
ఆర్మూర్	రూ. 9,600 – 11,200
తాలుకాయలు	రూ. 5,000 – 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,400
4884	రూ. 10,000 – 12,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 12,600
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,500
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 438

కొమ్ములు : 198 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,000	10,250	10,200

కాయలు : 240 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,000	10,250	10,200

మొత్తం అమ్మకాలు : 328.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

అల.. ఆక్రమణల తీరం

- టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కలిసి దందా
- రిసార్ట్స్ యజమానులకు తీరం భూముల అప్పగింత
- ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూముల అమ్మకం
- కొన్ని భూముల్లో ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్న వైనం
- తీరంలో ఎకరా రూ. 3 కోట్ల నుంచి 6 కోట్లు
- అమాంతం పెరిగిన భూముల ధరలు
- ఇదే అవకాశంగా ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్న రెవెన్యూ అధికారులు
- సీఆర్‌జెడ్ నిబంధనలకు తిలోదకాలు
- మడ, సర్వి చెట్లు కొట్టేసి సీ వ్యూకు రిసార్ట్‌లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వేటపాలెం మండలాల పరిధిలోని విజయలక్ష్మీపురం, ఓడరేవు, రామాపురం, కటారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రం తీరం(బీచ్)లో ఉన్న ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములను ఈ ప్రాంతానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులు టీడీపీ నేతలు, రిసార్ట్స్ యజమానులకు కట్టబెట్టి రూ.కోట్లు దండుకుంటున్నారు. ప్రైవేటు భూముల ధరతో పోలిస్తే కాస్త తక్కువ ధరకే ప్రభుత్వ, అటవీ భూములు లభిస్తుండడంతో రిసార్ట్స్ వ్యాపారులు రెవెన్యూ అధికారులకు అడిగినంత ముట్టజెప్పి భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. కబ్జా భూములను తమ రిసార్ట్‌లలో కలిపేసుకొని వాటిని మరింతగా విస్తరిస్తున్నారు. ఇదే అదనుగా చీరాల టీడీపీ ముఖ్య నేత కొందరు రెవెన్యూ అధికారితో కలిసి ఇక్కడున్న ప్రభుత్వ, అటవీ భూములను కొట్టేసి వాటిని తిరిగి రిసార్ట్ వ్యాపారులతోపాటు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వేటపాలెం మండలంలో ఇప్పటికే వేలాది ఎకరాలుగావున్న అటవీ, ప్రభుత్వ భూములను టీడీపీ నేతలతో కలిసి రెవెన్యూ అధికారులు అమ్మకానికి పెట్టి రూ.కోట్లు గడించినట్లు రెవెన్యూ వర్గాల్లోనే జోరుగా ప్రచారం సాగుతోంది.

మడ అడవుల నుంచి అలల వరకు ఆక్రమణలే..



వేటపాలెం మండలం రామాపురంలో సముద్రం అలల వరకూ గ్రావెల్ వేసి చదును చేసిన దృశ్యం

ఆక్రమించి.. విస్తరించి

రెవెన్యూ అధికారులకు డబ్బులు గుమ్మరించి కొంత, కబ్జాచేసి మరికొంత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటున్న వ్యాపారులు, పచ్చనేతలు తీరంలో రిసార్ట్‌లు, అధునాతన విడిది గృహాలు నిర్మించుకుంటున్నారు. వేటపాలెం మండలంలో విజయలక్ష్మీపురం మొదలు కొని ఓడరేవు, రామాపురం, కటారివారిపాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం తీరంవరకూ ఆక్రమణలు అధికంగా ఉన్నాయి.

ఊపందుకున్న రిసార్ట్స్ నిర్మాణాలు

చీరాల, వేటపాలెం సముద్రతీర ప్రాంతానికి రోజురోజుకూ పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. వీకెండ్స్‌లోనే ఏపీ నలుమూలలనుంచే కాక అటు తెలంగాణ నుంచి లక్షలాదిమంది తరలివస్తుండగా మిగిలిన రోజుల్లోనూ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తీరంలో వ్యాపారం పెరగడంతో ఇక్కడ రిసార్ట్స్ నిర్మించేందుకు ఏపీతో పాటు తెలంగాణకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, సినీ పరిశ్రమకు చెందిన వారితోపాటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతో సహా అన్నివర్గాలకు చెందిన స్థితి మంతులు భూములు కొంటున్నారు. దీంతో ఒకప్పుడు ఎకరం రూ. 25 లక్షలలోపు వున్న భూముల ధరలు నేడు ఎకరం రూ. 3 కోట్ల నుంచి 6 కోట్ల వరకు ధర పలుకుతోంది. వేటపాలెం పరిధిలోని ఓడరేవు మొదలు పొట్టిసుబ్బయ్యపాలెం వరకూ ఎకరం ధర సగటున రూ. 5 కోట్లుగా వుంది.

నిబంధనలకు ఆ'మడ' దూరం

రిసార్ట్‌ల పరిధిలో సీ వ్యూ కనిపించేందకు అడ్డుగా వున్న మడ, సర్వి చెట్లను అడ్డంగా నరికివేస్తున్నారు. తీరంలోని మడ, సర్వి చెట్లను నరికి వేయడం నేరం. కానీ అధికారులను లోబరుచుకొన్న రిసార్ట్‌ల యజమానులు ఏమాత్రం ఖాతరు చేయక చెట్లను నరికి వేస్తున్నారు. సముద్ర తీరంలో అలల తాకిడి, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీరం కోతకు గురికాకుండా ఉండేందుకు మడ చెట్లను పెంచుతారు. ఉదాహరణకు 2005లో వచ్చిన సునామీ దెబ్బకు ఇదే ప్రాంతంలోని పొట్టిసుబ్బయ్యపాలెంలో 9 మంది మరణించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతికి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సర్వి మొదలు ఇతర సామాజిక వనాలను అటవీశాఖ పెంచుతుంది.



సీ వ్యూకు అనుగుణంగా రిసార్ట్‌ల మధ్యన ఉన్న మడ, సర్వి చెట్లను తొలగించిన వైనం

ఆక్రమణలు 'అల'.. పట్టించుకోరేలా?

తీరంలో రిసార్ట్‌లు నిర్మించిన వ్యాపారులు తీరం అలల వరకూ ఆక్రమించి ఆ ప్రాంతంలో గ్రావెల్, చిప్స్ వేసి చదును చేసి తమ రిసార్ట్‌లకు వచ్చే పర్యాటకులకు విడిదిగా మారుస్తున్నారు. సాయంత్రం పూట పర్యాటకులు ఆ ప్రాంతాల్లో కూర్చొని సముద్రాన్ని చూసేలా ఏర్పాట్లు చేసుకొంటున్నారు. తీరాన్ని సముద్రం నీటివరకూ ఆక్రమిస్తున్నా చర్యలు శూన్యమనే చెప్పాలి.



ఓడరేవు ప్రాంతంలో తీరం వెంబడి అక్రమ నిర్మాణాలు

అధికారులకు కాసుల పంట

వేటపాలెం ప్రాంతంలో ప్రైవేటు భూములకు మించి ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూములు ఉండడంతో ఇదే అవకాశంగా కొందరు రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున డబ్బులు దండుకొని ఆ భూములను రిసార్ట్ యజమానులు, పచ్చనేతలకు అప్పగిస్తున్నారు. ఇక్కడి పచ్చనేత తనకు అనుకూలురైన ఒకరిద్దరు రెవెన్యూ అధికారులను వేటపాలెంలో నియమించుకొని భూముల విక్రయాలతో రూ.కోట్లు దండుకుంటునట్లు ఆరోపణలున్నాయి.
– అక్రమాలు స్పృతిమించడంతో వేటపాలెం తహసీల్దారును ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకట మురళి సరెండర్ చేశారు. తీరంలో భూ ఆక్రమణలపై చీరాల ఆర్డీఓ ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. ఇది సజావుగా సాగితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశముంది.

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నయీంభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం–1, హిస్టరీ–1, కామర్స్–2, కంప్యూటర్ సైన్స్–2, కెమిస్ట్రీ–1, జువాలజీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేయగలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 11వ తేదీ ఉదయం కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 8688169290లో సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రేపల్లె: మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు కోరారు. టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు, పార్క్ కూలీలకు, ఆఫీసు సిబ్బందికి, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కేటగిరిల వారీగా జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని విన్నవించారు. రిటైర్ అయిన కార్మికుల స్థానంలో, మృతి చెందిన వారి స్థానాలలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమస్యను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని శివప్రసాద్ హామీ ఇచ్చారు. సింగం వాణిశ్రీ పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణం వద్దు



మాట్లాడుతున్న రవికుమార్

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచవరపు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విద్యార్థి విభాగం సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ఈ మేరకు ఈనెల 7వ తేదీన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బాపట్ల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు యల్లావుల సోహిత్ యాదవ్, పర్చూరు నియోజకవర్గ అధ్యక్షులు కాటి లక్ష్మణ్, రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీ జాయింట్ సెక్రటరీ షేక్ పర్వే జ్, రేపల్లె అధ్యక్షులు వసీం మొహమ్మద్, చీరాల అధ్యక్షులు గోనబోయిన వెంకటేష్, జిల్లా విద్యార్థి యువ నాయకులు చోప్రా రాజశేఖర్ ఉన్నారు.

ఛిద్రమవుతున్న రోడ్లు



కొణిదెన రోడ్డులో లారీ నుంచి దొర్లిపడిన గ్రానైట్ రాయి(ఫైల్)



గోతుల మయంగా కొణిదెన- ఉప్పుమాగులూరు లింకు రోడ్డు

బల్లికురవ: గ్రామీణ రహదార్లు గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమౌతున్నాయి. అడుగుకో గోయ్యితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి తీసే స్టీల్‌గ్రే మీటరు, ముడిరాళ్లు మార్టూరు, గణపవరం, జొన్నతాళి, వేమవరం, మే దరమెట్ల, సంతమాగులూరు, ఒంగోలు, మురికి పూడి, తాతపూడిలోని పరిశ్రమలతోపాటు బెంగళూరు, తాడిపత్రి, చెన్నై, హైదరాబాద్ పట్టణాలకు నిత్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఒక్కో లారీపై ప్రమాదకరంగా 4 నుంచి 7 బ్లాక్‌లను ఎక్కిస్తూ 70 నుంచి 90 టన్నుల వరకు తరలిస్తున్నారు. గోతుల కారణంగా అంటూ ఎక్కడ రాయి దొర్లి కింద పడుతుందోనని ప్రజలు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.


ప్రతిపాదనలకే పరిమితం..

భారీ వాహనాల రాకపోకలతో బల్లికురవ–నాగరాజుపల్లి–మార్టూరు, చెన్నుపల్లి–వేమవరం జంక్షన్–తాతపూడి –అనంతవరం, కొణిదెన–వేమవరం జంక్షన్–ఉప్పుమాగులూరు, నక్కబొక్కలపాడు–కొదదెన–మార్టూరు, బల్లికురవ–సంతమాగులూరులో రోడ్లు మోకాటిలోతు గోతులతో 10 కిలో మీటర్లు ప్రయాణానికి సైతం 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతోంది. గోతుల్లో గ్రానైట్ లారీలు కూరుకుని ట్రాఫిక్‌జామ్‌లతో బస్సులు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులకు గమ్యం చేరతామన్న గ్యారంటీ లేదు.

గ్రానైట్‌దారుల ఆధీనంలో..

చెన్నుపల్లి–అనంతవరం రోడ్డులో కొండాయపాలెం గ్రామాల మధ్య క్వారీ నిర్వాహకులు ఆర్‌అండ్‌బీ రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. రహదారిపైనే యంత్రాలు, లారీలు నిలపడం, లోడింగ్ చేపట్టడం వల్ల తారురోడ్లు సైతం జారుడు బల్లను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈరోడ్డులో ప్రయాణించాలంటే సాహసం చేయక తప్పదు. దెబ్బతిన్న రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నారు. నిధులు మంజూరుతో టెండర్‌కు కాంట్రాక్టర్లను ఆహ్వానించినా భారీ వాహనాల రాకపోకలకు మెయింటెనెన్స్ ఇవ్వలేక రోడ్ల అభివృద్ధికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

గ్రానైట్ లారీ ఎదురైతే హడలే..



బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, అద్దంకి మండలాల్లో రహదార్లపై టూవీలర్, కార్లపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. 4 నుంచి 7 గ్రానైట్ బండలు, లారీ ట్రాలీలపై ఎగుమతితో ఎక్కడ ఒరుగుతాయోనని భయపడుతున్నాం.

– ధర్మవరపు రవికుమార్

ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధి లేదు..



బల్లికురవ, ఈర్లకొండ చుట్టూ 25 పైచిలుకు గ్రానైట్ క్వారీలు మండలంలో 600 పైచిలుకు పరిశ్రమలు ఉన్నాయి. ఎగుమతులకు రాయల్టీ చెల్లింపు ద్వారా ఆదాయం సమకూరుతున్నా రహదార్లు అభివృద్ధి చెందడం లేదు. ఇక్కడ నుంచి ప్రభుత్వానికి చెల్లించే ఆదాయంతో పూర్తిస్థాయిలో అన్ని రహదార్లను అభివృద్ధి పరచవచ్చు.

– తంగిరాల వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు

కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు హరిబాబు

పర్చూరు(చినగంజాం): యజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ కౌలు కార్డులివ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. పర్చూరులో రామానాయుడు ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో శుక్రవారం నిర్వహించిన కౌలు రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశంలో ప్రసంగించారు. కౌలు రైతులందరికీ గ్రామ సభలు జరిపి కౌలు కార్డులు ఇవ్వాలని.. కనీసం ఫసలీ రాయించి ఆ ప్రకారమైనా కార్డులివ్వాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని.. పొగాకు కొనుగోలు మందకొడిగా సాగుతోందని తెలిపారు. మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారని, మిర్చి పంటదీ అదే పరిస్థితి అన్నారు. కౌలు రైతులకు కార్డులివ్వడం , బ్యాంకు ద్వారా రుణాలివ్వడం, తిరిగి పంట వేసుకునేందుకు ప్రోత్సహించాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రేట్లు చాలా భారంగా ఉన్నాయని కౌలు రైతులంతా ఉమ్మడిగా కౌలు రేట్లు తగ్గించుకోవాలని కోరారు. దేవదాయ భూములు సాగు చేస్తున్న రైతులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా నాయకుడు కొండయ్య మాట్లాడుతూ వెంటనే సభ్యత్వాలు పూర్తి చేయాలని మండల మహాసభలు జరపాలని జూలై 26న స్వర్ణ గ్రామంలో నిర్వహించే జిల్లా మహాసభలకు అన్ని మండలాల నుంచి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి టి. యషయ్య అధ్యక్షత వహించారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు బండి శంకరయ్య, భాను, ఏడుకొండలు, గోవింద్, వెంకటరావు, రహీం, కొమ్మినేని శ్రీను, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవులదీవి ఎస్సైగా బాబురావు



నిజాంపట్నం: నిజాంపట్నం మండలం అడవులదీవి ఎస్సైగా బత్తుల బాబురావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు సీసీఎస్ నుంచి సాధారణ బదిలీల్లో అడవులదీవికి విచ్చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తీరంలో పేకాట, కోడి పందేలను పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు నిజాంపట్నం ఎస్సై తిరుపతిరావు ఇన్‌చార్జి ఎస్సైగా విధులు నిర్వహించారు.

దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలి

రేపల్లె: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని ముఠా వర్కర్స్ యూనియన్ కార్మికులకు శుక్రవారం ఆయన కరపత్రాలు అందజేసి మాట్లాడారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తోందన్నారు. పారిశ్రామికవేత్తలు, యజమానులకు అనుకూలంగా లేబర్ చట్టాలను మారుస్తోందన్నారు. కేంద్రం ప్రవేశ పెడుతున్న లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లేబర్ కోడ్‌లను అడ్డుకునేందుకు కార్మికులు ఐక్యంగా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, మధు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం



అమర్తలూరు(వేమూరు): విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళుతున్న ఉపాధ్యాయులు శాంతి అనురాధ, విజయలక్ష్మి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, పోతురాజు, గోపిలకు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా నిరీక్షణరావు మాట్లాడుతూ పాఠశాలలో 8 సంవత్సరాలుగా పిల్లలకు ఉన్నతమైన విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

బలిజేపల్లి(వేమూరు): కరెంట్ షాక్ వల్ల వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బలిజేపల్లి గ్రామ సచివాలయంలో లైన్‌మేన్‌గా గోపి పని చేస్తున్నాడు. శుక్రవారం మూడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా విద్యుత్ ఇవ్వడంతో కరెంట్ షాక్‌తో విద్యుత్ తీగకు వేలాడుతున్న గోపిని గ్రామస్తులు కర్రతో కొట్టడం వల్ల కింద పడ్డాడు. వెంటనే ప్రయివేటు వైద్యశాలకు తీసుకొని వెళ్లడం జరిగిందని విద్యుత్ శాఖ ఏఈ గోపి తెలిపారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు ఆయన చెప్పారు.

ఉగ్రవాదాన్ని అరికట్టాలి

బాపట్ల: ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చీమలదిన్నె శ్రీమన్నారాయణ కోరారు. విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదులు అబూబాకర్ సిద్ధిఖీ, మహమ్మద్ మన్సూర్ అలీలను అరెస్టు చేశారని గుర్తు చేశారు. తమిళనాడు బాంబు పేలుళ్లలో వీరు నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. మూడు నగరాల్లో పేలుళ్లకు భారీ కుట్ర జరిగిందని పోలీసులు తెలియజేశారన్నారు. ఎం.వెంకటరమణ, కోశాధికారి బూర్ల రత్తయ్య, బండారు జ్వాలా నరసింహ, వక్కలగడ్డ ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలి

ఎంపీపీ జాలాది రూబేను



చుండూరు(వేమూరు): మండల పరిషత్ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు పూర్తిగా సహకరించాలని ఎంపీపీ జాలాది రూబేను అన్నారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వివిధ శాఖలపై అధికారులను రివ్యూ చేశారు. ఉప ఎంపీపీ రమణా రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతులకు బ్యాంక్‌లు ద్వారా రుణాలు ఇప్పించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైట్ బ్రాంచి చానల్ పూడిక తీయాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. ఎంపీడీవో సుదీప, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెట్టుబడి మితం.. దిగుబడి అధికం

- వరిలో వెద సాగుపై దృష్టి సారించిన అన్నదాతలు
- సమయం, నీరు ఆదా అవుతాయంటున్న వ్యవసాయ నిపుణులు



నగరంలో విత్తనాల నాటిన తర్వాత యంత్రాలతో కలుపుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

నగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆధునిక పద్ధతులు అవలంభిస్తున్నారు. ఈ క్రమంలోనే వెద సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఖరీఫ్ సాగుకు సమయం దాటుతున్న తరుణంలో సాగు చేయకపోతే రెండో పంట సాగు కష్టమవుతుంది. దీంతో రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో సుమారు 28 వేల ఎకరాలలో ఖరీఫ్ వరి పంటను సాగు చేయాల్సి ఉంది. మే నెలలో వర్షాలు పడిన తర్వాత జూన్‌లో ఆశించినంతగా వర్షాలు పడలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వెద సాగుకు అనువుగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని నగరం, మంత్రిపాలెం, మీసాలవారిపాలెం, తాడివాకవారిపాలెం గ్రామాలలో వెద సాగుకు అనువైన పంట పొలాల్లో రైతులు సాగుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి యంత్రాలతో సాగు చేస్తున్నారు.

ఖర్చు తక్కువ, సమయం ఆదా

వెద సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు వెల్లడిస్తున్నారు. సాగునీటి వినియోగం తగ్గడంతోపాటు, సమయం కూడా ఆదా అవుతుందని చెబుతున్నారు. సాధారణ సాగు పద్ధతిలో ఎకరానికి 25 కేజీల విత్తనాలు అవసరమైతే, వెద పద్ధతిలో 12–15 కేజీల విత్తనాలు సరిపోతాయి. సాగునీటి తడులు కూడా చాలా తక్కువ అవసరమవుతాయని నిపుణులు అంటున్నారు. వెద సాగు ఖర్చు, సాధారణ సాగు కంటే రూ.6 వేల నుంచి రూ.8 వేలు వరకు తగ్గుతుండటంతో రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు.



నగరంలో వెదసాగు యంత్రంతో విత్తనాలు నాటుతున్న దృశ్యం

■ మెట్ట ప్రాంతాలే సాగుకు అనువని, పల్లపు భూములలో సాగు చేపట్టరాదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగు చేసిన రైతులు కలుపు నివారణ చర్యలు చేపట్టాలని కలుపు నివారించకపోతే భవిష్యత్‌లో దుబ్బు చేయదని దీనివల్ల రైతులకు అపార నష్టం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొంటున్నారు. విత్తనాలు నాటిన తర్వాత 48 గంటల లోపు కలుపు నివారణకు పెండిమిథాలియన్(స్టాంప్) లేదా ప్రెటిలాక్లోర్‌ను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వెద సాగును అవలంభించే రైతులు వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు.

బహుళ ప్రయోజనాలు



వరిలో వెదసాగు చేపట్టడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుత సమయంలో వెద సాగుకు పంట పొలాలు అనుకూలంగా ఉండటంతో వరి సాగు చేస్తున్నాం. వెద పద్ధతిలో సాగు చేయడం వల్ల సాగునీటి వినియోగం కూడా తగ్గుతుంది. బహుళ ప్రయోజనాలు ఉండటంతో వరిలో వెద సాగు చేపడుతున్నాం.

– ఎం.నాగరాజు, రైతు

వ్యవసాయ నిపుణుల సూచనలతోనే



సాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు వెద సాగు అనువుగా ఉంటుంది. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సమయం మించిపోతుంది. నారుమడులు పోసి మరలా వరి నాట్లు వేసేందుకు సమయం ఎక్కువవుతుంది. దీంతో వెద పద్ధతిలో పంట పొలాల్లో వరి విత్తనాలు వేస్తున్నాం. వెద సాగుతో తక్కువ ఖర్చు, సమయం, సాగునీరు ఆదా అవుతుంది. వ్యవసాయ నిపుణులు వెద సాగు చేయాలని సూచించడంతో వరిలో ఈ పద్ధతిని అవలభింస్తున్నాం.

– రత్నబాబు, రైతు

చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం
- మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

ఖాజీపాలెం(కర్లపాలెం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నాడని బాపట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ కన్వీనర్ కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఖాజీపాలెం విచ్చేసిన కోన రఘుపతి అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఖాజీపాలెం సెంటర్‌లోని సీతారామరాజు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవటం వలనే వైఎస్సార్‌సీపీ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో రచ్చబండ సమావేశాలు ఏర్పాటు చేసి క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించనున్నామని చెప్పారు. మండల, గ్రామ స్థాయిలలో పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను పూర్తి చేయాలని బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలను రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రజలలోకి తీసుకువెళ్ళి వారికి అందిన, అందాల్సిన పథకాలను తెలియజేస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని చెప్పాలని కోన రఘుపతి కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పిట్టలవానిపాలెం అధ్యక్షుడు వుయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ కృపానందం, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఏట్ర అశ్వనీరెడ్డి, పార్టీ నాయకులు షేక్ బాజీ, అహ్మద్ హుస్సేన్, మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాష్, షేక్ మౌలాలీ, వాలి శివారెడ్డి, దొంతిరెడ్డి కోటిరెడ్డి, బొలగాని సాంబశివరావు, కుంటం ప్రసన్నరాజు, విజయ భాస్కర్‌రెడ్డి, దేగల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సేవలో వంగవీటి కృషి ఆదర్శనీయం



రంగా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కోన రఘుపతి



రంగా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నరాలశెట్టి ప్రకాశరరావు

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

బాపట్ల : ప్రజా సేవలో వంగవీటి మోహన్‌రంగా సేవలు ఆదర్శనీయమని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. మోహన్ రంగా జయంతి సందర్భంగా బాపట్లలోని భీమావారిపాలెంలో రంగా విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. రంగా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, చెన్నకేశవ నాయుడు తదితరులు ఉన్నారు.

రాజకీయంలో సాటిలేని వ్యక్తి రంగా : మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి

రాజకీయాల్లో సాటిలేని వ్యక్తిగా వంగవీటి మోహన్‌రంగాకు గుర్తింపు ఉందని మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు గుర్తు చేసుకున్నారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, పాలెం సుబ్బారావు, కొటికలపూడి సురేష్ ,గిరిజారాణి ఉన్నారు.

రేపల్లెలో...

రేపల్లె: పేదల పక్షపాతి రంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు అన్నారు. రంగా జయంతి సందర్భంగా ఓల్డ్‌టౌన్‌లోని రంగా విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసి పేదల పక్షపాతిగా పేరొందారన్నారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కర్రీ వెంకట కృష్ణారెడ్డి, జిల్లా ఇంటలెక్చువల్ ప్రెసిడెంట్ రత్నాకర్, వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అతిక్, నాయకులు చిమటా బాలాజీ, అబ్దుల్ ఖుద్దూష్, గౌస్, నీలా నాంచారయ్య, లియాఖత్ భాషా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ చెప్పారు. మండల కేంద్రమైన నగరం మెయిన్ సెంటర్‌లో కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రంగా జయంతిని నిర్వహించారు. రంగా చిత్రపటానికి కాపు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగం రంగా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాగోలు వెంకటేశ్వరావు, బాలకృష్ణ, నాగేశ్వరావు, కాపు సంఘ నాయకులు పూర్ణచంద్రరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు ఇవ్వటం చేతకాని ప్రభుత్వం



మాట్లాడుతున్న చల్లా రామయ్య

బాపట్ల : రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికి ఒక కొత్త పెన్షన్ ఇవ్వటం చేతకాని కూటమి ప్రభుత్వానికి మాట్లాడే నైతిక హక్కులేదని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్లు ఇవ్వని ప్రభుత్వం ఉన్న పెన్షన్లు తీసివేసేందుకు సర్వేలు నిర్వహించటం ఎంతో బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు బోయిన సాంబయ్య మృతి చెందితే ఆయన భార్యకు కూడా పెన్షన్ టీడీపీ ప్రభుత్వం ఇవ్వలేకపోతే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, కోన రఘుపతి పెన్షన్ ఇప్పించారని గుర్తుచేశారు. బోయిన శివమ్మకు కూడా పెన్షన్ ఉందని, అయితే ఆమె కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం రావటంతో పెన్షన్ పోయిందన్నారు. తెల్లరేషన్ కార్డులో పేరు మార్చుకోవాలని చెబితే ఆ విషయాన్ని తెలుసుకోకుండా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షురాలు మల్లెల మౌనిక, నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కమలాకరరావు



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ యూనియన్ కార్మికులు

రేపల్లె: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కమలాకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 4, 5 తేదీలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో గ్యారెజ్ గేటు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. అలాగే సంవత్సరానికి 2 వేలకు పైగా కార్మికులు ఉద్యోగ విరమణ చేస్తున్నా ఆ ఖాళీలను భర్తీ చేయటం లేదన్నారు. కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్త బస్సులను మంజూరు చేయాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా బస్సు సర్వీసులను నడపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, అలెవెన్స్‌లను వెంటనే చెల్లించాలన్నారు. డిమాండ్‌ల సాధనకు ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ మరకా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సాంబశివరావు, గ్యారేజ్ సెక్రటరీ మౌలాఖాన్, సభ్యులు సాంబశివరావు, మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎంపీటీసీలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



చుండూరు(వేమూరు): మండల పరిషత్ అభివృద్ధికి ఎంపీటీసీలందరు పూర్తిగా సహకరించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చెరుకపల్లిలో వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు మండలంలోని ఎంపీటీసీలు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఒక తాటిపై ఉండి మండలం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉండే విధంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ దాట్ల మోహన్ రెడ్డి సౌజన్య, గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, గాదె శివరామ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేమూరులో రోశయ్య జయంతి



వేమూరు: మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత ఉందని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కె.మధు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటరులో ఆయన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మండల కేంద్రం అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులకు ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో బాదం వెంకట సుబ్బయ్య, పెనుమళ్ల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఒక మహోజ్వల శక్తి



నిజాంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో...



రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో...

రేపల్లె: మన్యం గుండె గుడిలో కొలువైన దేవుడు, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని హడలగొట్టిన వీరుడు మన అల్లూరి సీతారామరాజు అని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని నిజాంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి, దాని కొరకే ప్రాణాలర్పించిన యోధుడన్నారు. యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత అల్లూరి

రేపల్లె: యువతకు స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు అని ఆర్ఐ రాంబాబు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ వారి బాధల నుంచి నాడు మన్యంలోని ప్రజలను కాపాడేందుకు స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాటాలు చేశారన్నారు. అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తిని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట పటిమ ఆదర్శం

కర్లపాలెం: బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ ఆదర్శవంతమైనదని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. అల్లూరి జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కర్లపాలెం గ్రంథాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజని, సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సీడీపీవో లక్ష్మీదేవికి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

జంపని(వేమూరు): సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్మికునిపై ఉందని పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుంటూరు పుల్లారావు అన్నారు. జంపని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ప్రసాద్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొనిగల ఆగస్టీన్, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

అమర్తలూరు(వేమూరు): కేంద్ర ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు బి.అగస్టీన్ అన్నారు. మండల కేంద్రంలో సీడీపీవో లక్ష్మీదేవికి సార్వత్రిక సమ్మె నోటీసును శుక్రవారం ఆయన అంగన్‌వాడీలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అంగన్‌వాడీ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్కీమ్ వర్కర్స్‌కి గ్రాట్యుటీ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నియోజకవర్గ లీడర్ సి.బసవమ్మ, అంగన్‌వాడీలు ఎస్.నీరజ, జె.రూపారాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు: పేద వర్గాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరులో క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీ 4 కార్యక్రమం అమలుపై సమగ్ర చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని 15 శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. మార్గదర్శి కుటుంబాలను గుర్తించి వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలు మద్దతును అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేధికారి బాపట్ల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరరావు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు ఎంపీడీవోలు రవికుమార్, కొత్తపల్లి నరసింహరావు, వెంకటరమణ, మారుతి శేషాంబ, సుదీప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.